
# చర్విత చర్వణం

భమిడిపాటి సోమయాజి



వినయ మూర్తి, ముదిత దంపతులకి ఒక అబ్బాయి, అమ్మాయి. అమ్మాయి ప్రథమ సంతానం. ఈమెకి పెళ్ళి నిశ్చయమైంది. ముహూర్తం సమీపిస్తున్నా పెద్ద చలనం లేదు మూర్తిలో. తాత్సారం ఎక్కువ!

రైలు, ప్లాట్ ఫాం మీదకి వచ్చే సమయానికి కాని స్టేషన్‌కి చేరడు. ఇక్కడ అక్కడ ఉరుకులు పరుగులూ. రైలెక్కిన తర్వాత ''యీ ఆలస్యానికి కారణం నువ్వంటే నువ్వంటూ'' దంపతులు దెబ్బలాడుకోవడం!. ఒకసారి యిలా గొడవ పడుతూంటే, వీరి సూట్‌కేస్ ఎవరో ఎత్తుకు పోయారు. ఈ పోయిన సూట్‌కేస్ మీద మళ్లీ గొడవయింది.

పెళ్లి ముహూర్తం యిక పదిరోజులే వుంది. ఇంకా చాలామందిని పిలవవలసి వుంది. ముదితకి ఆదుర్దా ఎక్కువైంది. వంటింట్లోంచి వచ్చి ''ఈ పిలుపులు అసలు అవుతాయా! ఈరోజు ఆదివారం శెలవురోజు కదా. చాలామంది యిళ్ళలోనే వుంటారు. ఈ వేళ మీరు రాకపోతే పిల్లాడ్ని తీసుకుని నే వెళతాను''

''ఈరోజు యిక తప్పేట్లు లేదని'' స్వగతంగా అనుకుంటూ ''నువ్వెళదామంటే నే రానంటానా'' అన్నాడు. ''వానా! నువ్వొస్తానంటే నే వద్దంటానా'' అన్న పాటను అనుకరిస్తూ.

పిలుపులకి కార్లో బయల్దేరారు దంపతులు. ముదిత తరపు బంధువులందర్నీ పిలవడానికి నిర్ణయించుకుని మొదట ఆవిడ బాబయ్య యింటికి వెళ్ళారు.

''ఏం బాబయ్యా! మనవడేమంటున్నాడు'' అంది ముదిత.

''ఏమంటున్నాడేమిటి. అన్నీ మన మాటలే. అన్నీ మన పోలికలే వచ్చాయి'' అంటూ మనవడ్ని దగ్గరకి తీసుకుని ''ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్'' పద్యం చదివించాడు. తర్వాత కాఫీలు. మూర్తి మనసులో గుబులు మొదలైంది. ''అద్దెకార్లో వచ్చాం. ఆలస్యమైతే దాని అద్దె పెరుగుతుంది. వీళ్ళు చూస్తే పట్టపగలు నక్షత్రాల మీద పద్యాలు'' అనుకున్నాడు.

వాడ్ని యింకో పద్యం చదవమన్నారు. ''నేను చదవను'' అంటూ స్పీడుగా పరిగెట్టాడు వాడు. పరిగెడుతూ పడిపోయాడు. గెడ్డం చిట్లింది. ఆ అద్దెకార్లో తీసుకెళ్ళి వాడికి కట్టు కట్టించి తీసుకొచ్చారు.

అక్కడ్నించి ముదిత పెద్ద మామయ్యగారింటికి వెళ్ళారు. ఆయన మనవడి చేత కూడా ఆ నక్షత్ర పద్యం బోనస్‌గా ''జానీ జానీ వన్ పప్పా.. యీటింగ్ షుగర్ నొ పప్పా'' చదివించాడు. వినకపోతే మర్యాదగా వుండదని ఆ పద్యాలు ఒక వెర్రిపప్పులా విన్నాడు వినయమూర్తి.

తర్వాత ముదిత చిన్న మామయ్య యింటికి! ఆయన చాలా సహాయం చేసే మనిషట. అందుకని అక్కడ వినయంగా వుండమని ముందే చెప్పింది ముదిత. పెళ్ళికి ఆయన సహాయం చేస్తాడని, ఆయన నవ్వినప్పుడల్లా నవ్వాడు మూర్తి.

''కార్లో వచ్చాం'' అని తెలియ పరచడానికి ''అబ్బ ఈ కార్లో కూర్చుని కూర్చుని కాళ్ళు పట్టేశాయి'' అంది ముదిత.

లోపల్నుంచి వచ్చిన వాళ్ళ అత్తయ్య ''ఏమిటే పట్టుచీరలంటున్నావు'' అంది.

''పట్టు చీరలు కాదత్తయ్యా. కాళ్ళు పట్టేశాయి అన్నాను''

''ఓసి నీ యిల్లు బంగారం గానూ ఆ 'పట్టు' అన్న మాట విని, పట్టు చీరలనుకున్నాను. అయినా ఎన్ని కొంటున్నారేమిటి?''


''ఆ ఎన్ని కొంటాం. ఒక పట్టుచీర, ఒక నెక్లెస్ కొనమంటున్నాను నాకు'' అంది ముదిత.

''అసలే కారు అద్దెకి తీసుకోకపోతే కాళ్ళు పట్టకపోను, యీ పట్టు చీరల గొడవ లేకపోను'' అనుకున్నాడు మూర్తి.

అక్కడ పిలుపులైన తర్వాత ముదిత పిన్నిగారింటికి వెళ్ళారు. ముదిత చుట్టాలు సగం మంది భాగ్యనగరంలోనే వున్నారు. 'అదే తన దౌర్భాగ్యం' అనుకుంటూంటాడు మూర్తి.

ముదితా వాళ్ళ పిన్నికి రెండేళ్ళ మనవడున్నాడు. వాడిచేత అవయవ ప్రదర్శన చేయించారు.

''నీ కళ్ళేవి చూపించు'' అంటే వాడు చెవులు చూపించడం. వీళ్ళు ''కళ్ళు కళ్ళు'' అని గట్టిగా అరవడం వాళ్ళ పిన్ని ముదితా వాళ్ళకి వెనక్కి వెళ్ళి తన కళ్ళు చూపించడం అప్పుడు అర్థం చేసుకున్న ఆ పిల్లాడు వాడి కళ్ళు చూపించడం ''ఆ! వచ్చేసింది'' అని వీళ్ళ అరుపులు. ఇలా యించు మించు నాలుగు అవయవ ప్రదర్శనలయ్యాయి.




''మనిషికి అసలు యిన్ని అవయవాలు ఎందుకు యిచ్చావురా భగవంతుడా'' అనుకున్నాడు మూర్తి.

ముదితా వాళ్ళ మేనమామల్లో ఒకాయన మిలటరీ మేజర్. తర్వాత వీళ్ళింటికి వెళ్ళారు. వీళ్ళు వెళ్ళిన సమయానికి ఆ పక్క బంగళాలోని కెప్టెన్‌గారి అబ్బాయి మేజర్ గారింట్లో వున్నాడు. వాడ్ని మేజర్ ''నీ ముక్కేది'' అని అడిగారు. వాడు మేజర్ గారి ముక్కు పట్టుకున్నాడు. ''హ హ హ'' అంటూ ఒక మేజర్ నవ్వు నవ్వారు ఆ మేజర్.

ఇంతలో మేజర్‌గారి భార్య లోపల్నుంచి వచ్చింది. కుశల ప్రశ్నలడిగిన తర్వాత ''మీకేం హాయిగా సిటీలో వుంటున్నారు. మొన్న నెక్లెస్‌రోడ్ దగ్గర కూచిపూడి నృత్యప్రదర్శన అయిందటకదా. మంచి మంచి పట్టు చీరలతో నెక్లెస్‌లు పెట్టుకుని అద్భుతంగా నాట్యం చేశారట పిల్లలు. మేం యీ డిఫెన్స్ కాలనీలో, వూరికి దూరంగా వున్నాం. అటువంటివి చూసే అవకాశం లేకుండా పోయింది'' అంది.

ఆ మాటలు విన్న మూర్తి 'పట్టుచీరలూ, నెక్లెస్‌లూ ఒకేసారి వచ్చిపడ్డాయి' అనుకుంటూ తల పట్టుకున్నాడు.

'పైగా నెక్లెస్ రోడ్ ఒకటి. అసలా రోడ్‌కి నెక్లెస్‌రోడ్ అని ఎవరు పేరుపెట్టారో, అయినా కొంతవరకూ అదృష్టమే. ఏ వడ్డాణం రోడ్డో, కట్ల కాసులపేరు రోడ్డో అని పేరు పెడితే అంత బంగారం కొనలేక చచ్చేవాడ్ని' అనుకున్నాడు. పొద్దుట్నుంచీ విసుగు వలన మతిపోయిన మూర్తి.

ఈ లోపల ముదిత, మేజర్ గారితో బాతాఖానీ కొడుతోంది. ''వెళదాం రమ్మని పిలిస్తే'' మేజర్‌గారు చంపుతారేమోనని భయం.

మేజర్‌గారి కోడలు శాస్త్రీయ సంగీతంలో దిట్టట. ఆవిడ చేత కీర్తనలు పాడించారు. ''కీర్తనలు ఎలా వున్నాయి'' అని మూర్తిని అడిగాడు మేజర్. బాగాలేవంటే ఆయన తన బుర్ర 'రామకీర్తన' పాడిస్తాడని భయపడి ''చాలా బాగున్నాయి'' అన్నాడు మూర్తి. ఈ మేజర్ ముందు, వయస్సు ప్రకారం మేజర్ అయిన వాళ్ళు కూడా మైనర్లే.

అక్కడ శెలవు తీసుకుని బయటపడ్డ తర్వాత మూర్తి అన్నాడు ''ప్రతిచోట గంటలు గంటలు చేస్తున్నావు. మనం అద్దెకార్లో వచ్చాం. ఆ విషయం మరచిపోయావు కాబోలు. దానికి ఆలస్యమైతే అదనంగా యివ్వాలి''

''ఏం చెయ్యనూ. మా వాళ్ళందరికీ నేనంటే చాలా అభిమానం. ఒక పట్టాన వదలరు. ముఖ్యంగా చూసారు కదా మా మేజర్ మామయ్య ప్రేమ'' అంది ముదిత.

మేజర్ మాట వింటూనే మైనర్ అయిపోయాడు మూర్తి.

కొంత దూరం వచ్చిన తరువాత ''వెళ్ళిన చోటల్లా ఆ పద్యాలు ఆ అవయవ ప్రదర్శన ఏమిటి'' అన్నాడు.

''తప్పండీ! చిన్నపిల్లల్ని ఏమనకూడదు. వాళ్ళు దేవుడితో సమానం. మీరు చిన్నప్పుడు ఆ యింగ్లీషు పద్యాలు ఎలాగూ శ్రద్ధగా చదివి వుండరు. ఇప్పుడైనా నేర్చుకోండి''

''నడు యింటికి. ఇక యీ రోజుకి పిలుపులు చాలు. పద్యాలు నేర్చుకుంటాను. అసలు యీ జానీ గాడు ఎవడో మనదేశానికి ఎందుకొచ్చాడో రేపుతేలుస్తాను. పైగా యీటింగ్ షుగర్ నో పప్పా అన్న డయాబెటిస్ పద్యం అసలు ఎందుకు రాసారో కూడా తేలుస్తాను'' అన్నాడు మూర్తి.

''సర్లెండి. యిల్లు వచ్చేసింది. దిగండి కారు''

''ఇల్లు రాలేదు మనం ఇంటికి వచ్చాం'' అన్నాడు మూర్తి.

మళ్ళీ దీని మీద గొడవయింది.